సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 6 । జూన్ । 2025



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత 10లో



ప్రతి విద్యార్థికి స్కూల్ కిట్లు అందాలి 10లో



సంకల్ప బలం.. అకండ విజయం 10లో

న్యూస్‌రీల్

ఐటీఐ కౌన్సెలింగ్ ప్రారంభం



అర్హత పత్రాన్ని అందజేస్తున్న కన్వీనర్ శ్రీకాంత్

తాటిచెట్లపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి గురువారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తొలి రోజు 1 నుంచి 479 ర్యాంకర్లను కౌన్సెలింగ్‌కు పిలవగా 226 మంది హాజరయ్యారు. ఇందులో 185 మంది ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి అర్హత సాధించారు. అభ్యర్థులకు అర్హత పత్రాలను ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ అందజేశారు. శుక్రవారం జరిగే కౌన్సెలింగ్‌కు 480 నుంచి 1041 ర్యాంకు అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులకు, విద్యార్థులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు ఐటీఐ సిబ్బంది అందజేశారు.

బౌద్ధమతం శాంతిని బోధిస్తుంది

బౌద్ధ సన్యాసి గల్కండెగమ ఉదిత థెరో



బౌద్ధ గురువును సత్కరిస్తున్న ఏయూ విద్యా విభాగాధిపతి

విశాఖ విద్య: శ్రీలంకలోని థెరవాద సంప్రదాయానికి చెందిన బౌద్ధ సన్యాసి గల్కండెగమ ఉదిత థెరో ఏయూలోని విద్యా విభాగంలో 'బౌద్ధమతం–శాంతి విద్య'పై గురువారం ప్రసంగించారు. ఆధునిక కాలపు సంఘర్షణలను పరిష్కరించడం, అంతర్గత సామరస్యాన్ని పెంపొందించడంలో నాలుగు గొప్ప సత్యాలు, అష్టాంగ మార్గం ఔచిత్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు బుద్ధుని బోధనల ద్వారా శాంతి యొక్క ఆధ్యాత్మిక, తాత్విక కోణాలతో నిమగ్నమయ్యే అరుదైన అవకాశాన్ని అందించింది. విభాగాధిపతి ప్రొఫెసర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ, యువత అభివృద్ధిలో శాంతి విద్య యొక్క పరివర్తనాత్మక పాత్రను వివరించారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను తాత్కాలిక ప్రాతిపదికన జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం–పారాదీప్ (22810) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8, 15వ తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు, పారాదీప్–విశాఖపట్నం(22809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16వ తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు, విశాఖపట్నం–అమృతసర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 10వ తేదీన ఒక స్లీపర్ క్లాస్ కోచ్, అమృతసర్–విశాఖపట్నం(22808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14వ తేదీన ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాడపల్లికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

దాబాగార్డెన్స్: తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి విశాఖ నుంచి వాడపల్లికి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బస్సు బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. ప్రయాణ చార్జీ(ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్లను https://www. apsrtconline.inలో రిజర్వ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731లో సంప్రదించవచ్చు.

రిటైల్ ట్రైనీ, బీమా ఏజెంట్ కోర్సులకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ఆధ్వర్యంలో ఏయూలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలో ఉచితంగా రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఇన్సూరెన్స్ ఏజెంట్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి, అర్హత గల యువత ఏయూలోని గైడెన్స్ బ్యూరోలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్స్ పూర్తయిన తర్వాత నైపుణ్యం ఆధారంగా ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించనున్నారు. కోర్సులో కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

బెహరాకు జీ హుజూరు!

- ఫస్ట్ రిఫరల్ యూనిట్ ఓఅండ్‌ఎంకు రూ.1.2 కోట్లు చెల్లింపు
- గతంలో తీవ్రంగా విమర్శించిన టీడీపీ
- జీవీఎంసీలో కార్పొరేటర్‌గా ఉండి పనులు ఎలా చేస్తారని నిలదీత
- ఇప్పుడు అవే పనుల అప్పగింతకు సిద్ధం
- నేటి కౌన్సిల్ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు నిర్ణయం



కౌన్సిల్ సమావేశ మందిరం

దాబాగార్డెన్స్ : శ్రీహరిపురంలో ఉన్న ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్‌ఆర్‌యూ) నెలవారీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(నిర్వహణకు) బాధ్యతలను ప్రస్తుతమున్న విజయ(బెహరా) వెల్ఫేర్ సొసైటీకే అప్పగిస్తూ.. రూ.1.20 కోట్ల మేర చెల్లింపులు చేసేందుకు జీవీఎంసీ పాలకవర్గం సిద్ధమైంది. కుటుంబ సభ్యులు జీవీఎంసీలో కార్పొరేటర్లుగా ఉన్నప్పుడు... కాంట్రాక్టు ఎలా కట్టబెడతారంటూ గతంలో ఇదే కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. కాంట్రాక్టును కేటాయించొద్దంటూ కౌన్సిల్ సమావేశంలో నానా రభస చేశారు. మొన్న జరిగిన మేయర్‌పై **అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌లో బెహరా భాస్కరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు జనసేనలోకి జంప్ కావడంతో కూటమికి ప్రీతిపాత్రులయ్యారు. దీంతో మొన్నటిదాకా అక్రమమంటూ పెడబొబ్బలు పెట్టిన ఇదే కూటమి నేతలు ఇప్పుడు ఎర్రతివాచీ పరిచి మరీ కాంట్రాక్టును కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ మేరకు** శుక్రవారం జరగనున్న సమావేశంలో 18వ ఎజెండాగా ఈ కేటాయింపుల అంశాన్ని చేర్చారు. అలాగే టెండర్లు పిలవకుండా ఎలా కేటాయిస్తారని స్థానిక ఎమ్మెల్యే మండిపడుతున్నట్టు తెలిసింది.

అవినీతిపై విచారణ పూర్తి కాకుండానే..

ఓ సీనియర్ అసిస్టెంట్ వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా.. అనుమతి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి ఈయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇంకా విచారణ పూర్తి కాలేదు. అయితే తనను కలిసి దరఖాస్తు చేసుకున్నారంటూ మేయర్ ఏకంగా ఎజెండాలో మొదటి అంశంగా చేర్చినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కూడా ఇదే కూటమి నేతలు గతంలో ఆరోపణలు గుప్పించిన విషయాన్ని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రతి నియోజకవర్గం ఓ జోన్‌గా..

27 అజెండా అంశాలతో పాటు మరికొన్ని అంశాలు **టేబుల్ అజెండాగా సభ్యుల ముందుకు చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా ఇప్పటి వరకు** జీవీఎంసీలో 8 జోన్లు ఉన్నప్పటికీ నియోజకవర్గాలకు సంబంధించి సమస్యలు తలెత్తుతున్నాయి. జోన్–5 కార్యాలయం జ్ఞానాపురంలో ఉంది. ఈ జోన్ పరిధిలోకి దక్షిణ నియోజకవర్గం, పశ్చిమ నియోజకవర్గం, ఉత్తర నియోజకవర్గానికి చెందిన వార్డులు వస్తున్నాయి. దీంతో నియోజకవర్గ సమస్య తలెత్తుతున్న దృష్ట్యా.. జీవీఎంసీ పరిధిలో గల నియోజకవర్గాల కిందకు ఆ నియోజకవర్గానికి చెందిన వార్డులను కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశం తీర్మానించనుంది. ఇక నుంచి ఏ నియోజకవర్గానికి సంబంధించి, ఆ నియోజకవర్గ జోనల్ కార్యాలయంలోనే వ్యవహారాలు సాగనున్నాయి. ఈ అంశాన్ని టేబుల్ అజెండాలో పొందుపరిచినట్టు తెలిసింది.

నేటి కౌన్సిల్‌లో కీలక అంశాలు

మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో 27 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటితో పాటు మరికొన్ని టేబుల్ అజెండా అంశాలు వచ్చే అవకాశం ఉంది. వీటిలో మినిస్టీరియల్ విభాగానికి సంబంధించిన అంశాలు, పలు అభివృద్ధి పనులకు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి పొరుగు సేవల విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మాస్ మజ్దూర్ల సేవలు 2026 మార్చి 31వరకు కొనసాగించేందుకు పరిపాలన ఆమోదం, జోన్–4లో యూజీడీలో లోపాల్లేకుండా నిర్వహణకు 6 కేఎల్ జెట్టింగ్ వాహనాలు సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి అంగీకరించేందుకు పరిపాలన ఆమోదంతో పాటు మరికొన్ని అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సన్నద్ధం

కౌన్సిల్ సమావేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు జీవీఎంసీలోని వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల సత్య శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కుంటుపడిన అభివృద్ధి పనులు, ముఖ్యంగా పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించని కూటమి ప్రభుత్వ తీరుపై నగర ప్రజల తరపున కౌన్సిల్‌లో చర్చించేందుకు సిద్ధమయ్యారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు

దిక్కులేని జీవీఎంసీ

- కమిషనర్ లేని పాలన.. విశాఖకు తీరని వేదన
- ఫైళ్లు పేరుకుపోతున్నాయి.. పనులు సాగడం లేదు
- జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్ ఎప్పుడు?
- కూటమి నిర్లక్ష్యంపై నగర ప్రజల ఆగ్రహం



దాబాగార్డెన్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా.. ఐదు నెలలుగా రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో నగర పాలన పూర్తిగా గాడితప్పింది. రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌కు నెలల తరబడి కీలక అధికారిని నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోయాయి. అధికారుల్లో జవాబుదారీతనం కొరవడింది. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్తంభించిన పాలన

రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో జీవీఎంసీలో పర్యవేక్షణ కొరవడింది. పాలన స్తంభించిపోయింది. సుమారు 20 లక్షల జనాభా, 98 వార్డులున్న జీవీఎంసీ బాధ్యతలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు అప్పగించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్న ఆరోపణలున్నాయి. ఓ వైపు కలెక్టరేట్ వ్యవహారాలు.. మరోవైపు జీవీఎంసీ బాధ్యతలతో ఆయన సతమతమవుతున్నారు. దీంతో క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడి, ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కింది స్థాయి అధికారులు సైతం తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తుండడంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. పనులు ముందుకు సాగడం లేదు. నూతన మేయర్ సైతం సమీక్షలకే పరిమితమయ్యారని, అధికారులను జవాబుదారీ చేసే స్థాయిలో చర్యలు కొరవడ్డాయని విపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు.

అటకెక్కిన అభివృద్ధి, పారిశుధ్యం

కమిషనర్ లేని లోటు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కమిషనర్ హయాంలో మురికివాడల అభివృద్ధి, రూ.500 కోట్లతో తాగునీటి పైపులైన్ల మంజూరు, గుర్తించిన 1,150 ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధి వంటి కీలక ప్రతిపాదనలు చేశారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో చేపట్టాల్సిన పనులన్నీ ప్రస్తుతం నిలిచిపోయాయి. ఉన్నతాధికారి పర్యవేక్షణ కొరవడటంతో పారిశుధ్య నిర్వహణ దయనీయంగా మారింది. ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. మురికివాడలు, కొండవాలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. దోమలు విజృంభించి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట, పండావీధి, అల్లిపురం, కొబ్బరితోట, పద్మానగర్, చిలకపేట, జాలారిపేట, రంగిరీజువీధి, చెంగల్రావుపేట, జబ్బరతోట, పెయిందొరపేట, కోటవీధి, ఫెర్రీరోడ్డు, తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆరిలోవ, డెయిరీఫాం ఏరియా, రామ్‌నగర్‌తో పాటు పలు మురికివాడ ప్రాంతాలు, ఉత్తర నియోజకవర్గ పరిధిలో పలు కొండవాలు ప్రాంతాలు, మురికివాడ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి.

ప్రజాగ్రహం, ప్రతిపక్షాల ఆందోళన

జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నగర ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్‌నే నియమించలేని ప్రభుత్వం.. రాష్ట్రాన్ని ఏం పాలిస్తుంది? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. ఐదు నెలలుగా కమిషనర్ లేకపోవడం జీవీఎంసీ చరిత్రలోనే ఇది మొదటిసారని, ఇది కూటమి ప్రభుత్వ ఘనకార్యమని విపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. తక్షణమే సమర్థవంతమైన ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించి, నగర పాలనను గాడిలో పెట్టాలని సీపీఎం, సీపీఐ ఫ్లోర్ లీడర్లు గతంలోనే నిరసన వ్యక్తం చేశారు. సమర్థంగా పనిచేస్తున్న కమిషనర్‌ను అర్ధాంతరంగా బదిలీ చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసం విశాఖను దిక్కులేని నగరంగా మార్చివేశారని, ప్రజల సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని మండిపడ్డారు.

ప్లాస్టిక్ నియంత్రణ ఎక్కడ?

నగరంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. గత మేయర్, కమిషనర్ హయాంలో చేపట్టిన ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, డోర్–టు–డోర్ ప్రచారాలు, నియంత్రణ కమిటీలు అన్నీ అటకెక్కాయి. దీంతో నగరంలో మళ్లీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దర్శనమిస్తోంది.

జీవీఎంసీని గాడిలో పెట్టేదెవరు?



జీవీఎంసీకి రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం నగర పాలనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. అభివృద్ధి కుంటుపడింది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఫైళ్లు కదలడం లేదు. రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌కు కమిషనర్‌ను నియమించకుండా కూటమి ప్రభుత్వం ఆడుతున్న నాటకమేంటో? నగర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కమిషనర్‌ను నియమించడం అత్యవసరం.

– బానాల శ్రీనివాసరావు, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్

జూలై 9, 10 తేదీల్లో గిరి ప్రదక్షిణ

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

విశాఖ సిటీ: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణ జూలై 9, 10 తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. భక్తులు జాతీయ రహదారిని దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్, సీపీ శంఖబ్రత బాగ్చి అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సమన్వయం చేసుకొని చర్యలు చేపట్టాలని చెప్పారు. తొలి పావంచా వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద గట్టి బందోబస్తు కల్పించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంబులెన్సులు, వైద్య శిబిరాలు సిద్ధం చేయాలని వైద్యాధికారులకు సూచించారు. అప్పుఘర్ వద్ద భక్తులు సముద్ర స్నానాలు చేసే సమయంలో మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొండపై అగ్నిమాపక యంత్రం, ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఉదయం నుంచి దర్శనాలు : ప్రధాన అర్చకుడు వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. జూలై 9వ తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథ యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టడం ద్వారా 32 కి.మీ మేర గిరి ప్రదక్షిణ మొదలవుతుందని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామికి నాలుగో విడత చందన సమర్పణ జరుగుతుందని తెలిపారు.

యంత్రాంగం సహకారంతో ఏర్పాట్లు

ఆలయ ఈవో త్రినాథరావు మాట్లాడుతూ యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం తరపున చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గుర్తించిన 28 ప్రదేశాల్లో 290 తాత్కాలిక టాయిలెట్లు, 129 శాశ్వత టాయిలెట్లు, జీవీఎంసీ ఆధ్వర్యంలో మరో 29 శాశ్వత టాయిలెట్లు, 31 వైద్య శిబిరాలు, 6 ప్రధాన ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కొండపైన 170, దిగువన 58 సీసీ కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగిన విధంగా కొబ్బరి కాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బి.హెచ్.భవానీ శంకర్, ఆర్డీవో సంగీత్ మాథుర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలకార్మికుల విముక్తిపై దృష్టి సారించాలి

విశాఖ సిటీ: బాల కార్మికులను గుర్తించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ(డీటీఎఫ్‌సీ) సభ్యులు చురుగ్గా పాల్గొని బాల కార్మికులకు విముక్తి కలిగించాలని డీఆర్వో భవానీశంకర్ సూచించారు. గురువారం డీఆర్వో తన చాంబర్‌లో ఈ నెల 2 నుంచి ప్రారంభమైన చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌పై డీటీఎఫ్‌సీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రైవ్‌లో గుర్తించిన బాల కార్మికులను పునరావాసం కోసం సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చాలని చెప్పారు. బాల కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో డ్రైవ్ కోసం ప్రణాళిక రూపొందించాలన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ విద్యార్థుల జాబితా సమర్పించి డ్రైవ్ సమయంలో వారి గుర్తింపునకు సహకరించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. బాల కార్మికులతో పనిచేయిస్తున్న వ్యాపార యాజమానులపై చర్యలు తీసుకోవాలని, రూ.20 వేలు జరిమానా విధించాలని కార్మిక శాఖ అధికారులకు చెప్పారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి

కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపు



బీచ్‌రోడ్డులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్



మొక్క నాటుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

ఏయూక్యాంపస్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్.కె.బీచ్ నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు నిర్వహించిన గ్రీన్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 5 లక్షల మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మిలియన్ కంటే ఎక్కువ మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా చేపట్టాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, దానికి బదులుగా వస్త్ర, నార సంచులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని హెచ్చరించారు. జీవీఎంసీ పరిధిలో 6 వేల మంది పారిశుధ్య సిబ్బంది నిరంతరం నగర పరిశుభ్రతకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలే ప్లాస్టిక్‌ను నిషేధిస్తే దాని డిమాండ్ తగ్గి ఉత్పత్తి కూడా తగ్గుముఖం పడుతుందని అభిప్రాయపడ్డారు. మొక్కలు నాటడంలో భాగస్వాములైన దివీస్, లారా, కోరమండల్, మాట్రిక్స్, అలోవెరా వంటి పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యాన్ని కలెక్టర్ అభినందించారు. గ్రీన్ ర్యాలీకి ముందు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్ వద్ద మొక్క నాటారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో, జూ క్యూరేటర్ మంగమ్మ, కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ, అటవీశాఖ, పోలీసులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు పర్యావరణ చైతన్యం పెంపొందిస్తూ కళాకారులు గీతాలను ఆలపించారు.

కుమ్మేసిన వర్షం



ఆరిలోవ: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా తీవ్రమైన ఎండతో అల్లాడుతున్న నగరవాసులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. అయితే కొన్ని చోట్ల గాలివాన బీభత్సంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్, ఎంవీపీ డబుల్‌రోడ్డులో చెట్లు నేలకూలాయి. కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రోడ్లపై చెట్లు విరిగిపడటంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. శానిటరీ సిబ్బంది రంగంలోకి దిగి చెట్లను తొలగించారు. మద్దిలపాలెం ప్రాంతంలో సుమారు 45 నిమిషాల పాటు కురిసిన వర్షానికి రోడ్లు, కాలనీలు తడిసిముద్దయ్యాయి. మద్దిలపాలెం, కేఆర్‌ఎంకాలనీ, శివాజీపాలెం రోడ్డు, పిఠాపురంకాలనీలో రోడ్లు వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. మధురవాడ పరిసర ప్రాంతాల్లో గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, హైవే సర్వీసు రోడ్లు జలమయమయ్యాయి. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో కారు మబ్బులు అలుముకున్నప్పటికీ వర్షం కురవలేదు.



పీఎంపాలెం విజేత సూపర్‌మార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు



విశాలాక్షినగర్‌లో విరిగిన చెట్లను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది



ఈదురుగాలులకు ఎంవీపీ డబుల్ రోడ్డులో నేలకొరిగిన చెట్లు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్లిపురం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం న్యాయ సేవా సదన్ ప్రాంగణం, జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. అనంతరం న్యాయాధికారులు, న్యాయవాదులు, పారా న్యాయ సహాయకులు, ప్యానెల్ లాయర్లు, న్యాయవాదులు, శిక్షణ పొందిన మధ్యవర్తులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విశాఖపట్నం ఇన్‌చార్జి కార్యదర్శి యం.వెంకటేశ్వర రావు, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లాలం పార్వతి నాయుడు, బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణ మోహన్, ఆర్.శ్రీనివాసరావు, వి.చిన్నా రావు, టి.పాపారావు, టి. తులసీదాస్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ టి.వెంకటముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితమే ప్రధానం



అవగాహన కల్పిస్తున్న పర్యావరణ ప్రేమికులు

బీచ్‌రోడ్డు: పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భూమి పొరలను నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇస్కాఫ్, గ్లోబల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇస్కాఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జె.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల పేరుతో వినాశకర వస్తువులను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి విఘాతం కలుగుతోందని, దీని వల్ల మానవాళి సంవత్సరాల తరబడి వైకల్యం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతోందన్నారు. ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అని అన్నారు. మలయాళీ వరల్డ్ కౌన్సిల్ సెక్రటరీ జోషి, గ్లోబల్ నెట్‌వర్క్ ప్రతినిధి రామ్ ప్రభు, బస్ పోతన, వై.సత్యవతి తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణలో ప్రజలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు.

కలెక్టరేట్‌లో మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

విశాఖ సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు చేతుల మీదుగా కలెక్టరేట్ అధికారులకు, సిబ్బందికి, సాధారణ పౌరులకు మొక్కలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు.

కేజీహెచ్ కిటకిట



కేజీహెచ్ గురువారం రోగులతో కిటకిటలాడింది. ఓపీ, మందులు ఇచ్చే కౌంటర్ వద్ద భారీ క్యూలు దర్శనమిచ్చాయి. ఇతర ప్రాంతాల నుంచి అత్యవసర వైద్యం కోసం క్యాజువాల్టీకి రోగులను తీసుకువచ్చిన అంబులెన్సులతో ఓపీ గేటు నిండిపోయింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సంకల్ప బలం.. అకుండ విజయం

జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టుకు చెందిన బోర కోటిరెడ్డి సంకల్పానికి సజీవ రూపం. పుట్టుకతోనే పోలియో మహమ్మారి వెంటాడినా.. ఆయన ఆత్మవిశ్వాసం ముందు ఆ వైకల్యం తలవంచింది. 42 ఏళ్ల ఈ వ్యక్తి పారా బాడీబిల్డింగ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకుని నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అలుపెరుగని కృషి, మొక్కవోని దీక్షతో ఆరు సార్లు మిస్టర్ ఇండియా పోటీల్లో పాల్గొని.. నాలుగుసార్లు విజేతగా నిలిచాడు. నాలుగు సార్లు భారీ ప్రైజ్‌మనీతో మిస్టర్ ఆంధ్ర, ఈస్ట్‌జోన్ పోటీలు నిర్వహించి శభాష్ అనిపించుకున్నాడు. - తగరపువలస

- వైకల్యాన్ని అధిగమించిన కోటిరెడ్డి
- మిస్టర్ ఇండియాగా నాలుగు సార్లు
- కోచ్‌గా ఎంతో మందికి మార్గనిర్దేశం
- సేవల్లోనూ ఇతరులకు ఆదర్శం





2024 తమిళనాడు మిస్టర్ ఇండియా పోటీలో విజేతగా కోటిరెడ్డి(మధ్యలో)

ఫొటోగ్రాఫర్ ప్రోత్సాహం

కోటిరెడ్డి ఈ స్థాయికి చేరుకోవడానికి వెనుక, ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ సాడి వెంకటేష్ ప్రోత్సాహం ఎంతగానో ఉంది. ఒక బాడీబిల్డర్ కాకుండా.. ఒక ఫొటోగ్రాఫర్ ఆయనలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం విశేషం.

విజయాలు.. సవాళ్లు

పారా బాడీ బిల్డింగ్‌లో కోటిరెడ్డి సాధించిన విజయాలెన్నో.. 2013లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన మిస్టర్ ఇండియా పోటీలో మూడవ స్థానం, 2015, 2017లో బెల్గాంలో జరిగిన సతీష్ సుగర్ క్లాసిక్ (మిస్టర్ ఇండియా) పోటీల్లో వరుసగా రెండు, మొదటి స్థానాలు కైవసం చేసుకున్నారు. 2019లో మీరట్, 2024లో తమిళనాడు, పంజాబ్‌లలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి తన సత్తా చాటారు. ఇప్పటివరకు తగరపువలస కేంద్రంగా 2008, 2010, 2017లో మిస్టర్ ఆంధ్ర, 2014లో ఈస్ట్‌జోన్ స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలతో పాటు పారా బాడీ బిల్డింగ్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఇండియన్ బాడీబిల్డింగ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా కూడా సేవలందిస్తున్నారు.

సామాజిక సేవ

ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. కోటిరెడ్డి సేవా దృక్పథాన్ని వీడలేదు. తన తల్లిదండ్రులు బోర అప్పన్న రెడ్డి, అప్పయ్యమ్మల పేరుతో ఏటా రక్తదాన శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. బాడీబిల్డింగ్‌ను ఒలింపిక్స్‌లో చేర్చాలని, ఇతర క్రీడల మాదిరిగానే ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం కోటా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్పాన్సర్లు ముందుకు వస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించడానికి సిద్ధంగా ఉన్నానని, 60 ఏళ్ల వయసు వరకు పోటీలలో పాల్గొంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఏ క్రీడ అయినా సరే.. అది మనల్ని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచుతుంది. క్రమం తప్పకుండా జిమ్‌కు వెళితే ఉక్కులాంటి శరీరం, మంచి ఆరోగ్యం మీ సొంతమవుతుంది' అని కోటిరెడ్డి యువతకు సందేశమిస్తున్నారు.

నిడిగట్టు నుంచి మొదలైన ఈ స్ఫూర్తిదాయక ప్రస్థానం.. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తూ, ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది. బోర కోటిరెడ్డి కేవలం ఒక బాడీబిల్డర్ మాత్రమే కాదు.. ఆయన ఒక యోధుడు, మార్గదర్శకుడు.


2019 మీరట్‌లో మిస్టర్ ఇండియా పోటీలో విజేతగా..

నగరంలోని బుల్లయ్య కళాశాలలో బీకాం పూర్తి చేసిన కోటిరెడ్డి.. తన ఆసక్తిని బాడీబిల్డింగ్ వైపు మళ్లించారు. ఆరేళ్ల కఠోర శిక్షణ అనంతరం దీనినే తన ఉపాధిగా మార్చుకున్నారు. గత 20 ఏళ్లుగా ఈ రంగంలో అప్రతిహతంగా కొనసాగుతున్నారు. తొలిసారిగా తగరపువలస బైపాస్‌రోడ్డులో శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్‌ను స్థాపించారు. అప్పట్లో ఈ జిమ్‌కు రూ.8 లక్షలు ఖర్చు చేయగా తర్వాత రూ.25 లక్షల విలువైన వ్యాయామ పరికరాలను అందుబాటులో ఉంచారు. తర్వాత జీవీఎంసీ భీమిలిలో జోన్ సంతపేట చిల్డ్రన్స్ పార్కులో 1,500 చదరపు అడుగు విస్తీర్ణంలో రూ.12 లక్షల పరికరాలు, నగరంలోని కృష్ణా కళాశాల వద్ద 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.70 లక్షల పరికరాలతో జిమ్‌లను ప్రారంభించారు. త్వరలో సంగివలస సుఖీభవ కాలనీ వద్ద 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మరో అధునాతన జిమ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆనందపురంలో మరో జిమ్‌ను తెరచి.. తన శిష్యుడికి అప్పగించారు. కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా ఎంతోమంది ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్లకు ఉపాధి కల్పిస్తూ.. సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆర్మీ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాకుండా, బరువు తగ్గాలనుకునే వారికి మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు. ప్రస్తుతం తన మకాంను నగరంలోని రామాటాకీస్ ప్రాంతానికి మార్చుకున్నారు.

భారీగానే ఖర్చు

బాడీ బిల్డింగ్ అంటే అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. మిస్టర్ ఇండియా పోటీలకు సిద్ధం కావాలంటే దాదాపు ఏడు నెలల పాటు కఠోరంగా శ్రమించాలి. రోజుకు 750 గ్రాముల చికెన్, 20 కోడిగుడ్లు, 250 గ్రాముల కూరగాయలు, పండ్లు, ప్రొటీన్ పౌడర్, మల్టీ విటమిన్ టాబ్లెట్లతో పాటు రోజుకు నాలుగు గంటల వ్యాయామం అవసరం. మిస్టర్ ఇండియా పోటీల కోసం కోటిరెడ్డి వద్దకు వచ్చే వారికి ఈ విధంగానే శిక్షణ ఇస్తారు. అయితే ఇందుకు నెలకు రూ.40,000 పైనే ఖర్చవుతుందని, పోటీలకు సిద్ధం కావడానికి మొత్తం రూ.4 లక్షల వరకు వ్యయమవుతుందని కోటిరెడ్డి తెలిపారు. గెలిచిన ప్రైజ్‌మనీ ఈ ఖర్చులతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖర్చుతో కూడినది కావడంతో బాడీ బిల్డింగ్‌ను ప్రోత్సహించేవారు తక్కువగా ఉన్నారన్నారు. కోవిడ్-19 సమయంలో జిమ్‌ల మూసివేత వలన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థికి స్కూల్ కిట్లు అందాలి


తోటగరువు హైస్కూల్ బుక్స్ స్టాక్ పాయింట్‌లో కిట్లు పరిశీలిస్తున్న దేవానందరెడ్డి


ఆరిలోవ: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందించాలని కేజీబీవీ కార్యదర్శి, జిల్లా నోడల్ ఆఫీసర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. విశాఖ జిల్లాలో మండల హెడ్‌క్వార్టర్లలో విద్యార్థి మిత్ర కిట్లు ఉన్న పలు స్టాక్ పాయింట్‌లను గురువారం సందర్శించారు. ఇందులో భాగంగా చినగదిలి మండలం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అక్కడ కిట్లలో పాఠ్య పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు పరిశీలించి, డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌తో కలసి ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎంఈవోలతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యార్థి మిత్ర కిట్లను అందించాలన్నారు. 121సి అడ్మిషన్ల విషయంలో ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి విద్యార్థులందరికీ ప్రవేశాలు పొందేవిధంగా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ విజయవంతానికి అందరు ఎంఈవోలు భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టి పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలు జరిగేటట్లు చూపడాలిన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ జె.చంద్రశేఖర్, సెక్టోరియల్ ఆఫీసర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

పెందుర్తి: మనవడు తన బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టాడని మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. వేపగుంట ముత్యమాంబ కాలనీలో 70 ఏళ్ల వృద్ధురాలు నివాసముంటోంది. ఇటీవల ఆమెకు తెలియకుండా ఆమె మనవడు బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టాడు. గురువారం ఈ విషయం వృద్ధురాలికి తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ తీసి.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు వెంటనే స్పందించి వృద్ధురాలిని రక్షించారు. అనంతరం ఆమె మనవడిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాకట్టు పెట్టిన నగలను తక్షణమే తిరిగి ఇవ్వాలని సూచించారు. వృద్ధురాలికి ధైర్యం చెప్పారు.

సముద్ర ఆహార రంగాభివృద్ధికి నైపుణ్యం కీలకం

ఎంపీఈడీఏ కార్యదర్శి అనిల్‌కుమార్


మాట్లాడుతున్న ఎంపీఈడీఏ కార్యదర్శి అనిల్‌కుమార్

డాబాగార్డెన్స్: సముద్ర ఆహార విలువ జోడింపుపై గురువారం నగరంలో అంతర్ రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ జరిగింది. సముద్ర ఆహార ప్రాసెసింగ్ నిపుణుల కోసం మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంపీఈడీఏ) తొలిసారిగా 'ఇంటర్ స్టేట్ స్కిల్ ఒలింపియాడ్ ఆన్ సీఫుడ్ వాల్యూ అడిషన్ ప్రిలిమినరీ రౌండ్(జోన్ ఐఐ ఈస్ట్ కోస్ట్)'ను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీఈడీఏ కార్యదర్శి అనిల్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. భారతదేశ సముద్ర ఆహార రంగాన్ని అభివృద్ధి చేయడంలో నైపుణ్యాభివృద్ధి, విలువ జోడింపు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఇది భారత ప్రభుత్వ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. ఎంపీఈడీఏ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీఎస్ఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.లక్ష్మణరావు, నెక్కంటి సీఫుడ్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్, శాస్త్రవేత్త డాక్టర్ కిజకుడాన్, ఫిష్ ప్యాకర్స్ ప్రతినిధి నాగహనుమాన్, రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా తూర్పు తీరానికి చెందిన 20 మంది నైపుణ్యం కలిగిన సముద్ర ఆహార నిపుణులు ఇంటర్-స్టేట్ స్కిల్ ఒలింపియాడ్‌లో పాల్గొన్నారు. వీరు రొయ్యలు, స్క్విడ్, తిలాపియాతో 10 విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తులను తయారు చేశారు. సముద్ర ఆహార పరిశ్రమ, మత్స్య సంస్థల నిపుణులతో కూడిన నలుగురు సభ్యుల ప్యానెల్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించింది. కార్యక్రమంలో ప్రాసెసింగ్ టెక్నాలజిస్ట్ డాక్టర్ రమ్యకుమారి, కోటేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి

11న ఉన్నతాధికారులకు వినతిపత్రాల అందజేత


సమావేశంలో మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

డాబాగార్డెన్స్: వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించి కేంద్రం రద్దు చేసిన రెండు చట్టాలను పునరుద్ధరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 9న అఖిల భారత కార్మిక సంఘాలు నిర్వహించే వివిధ కార్యక్రమాలకు వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. నగరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేయగా అందులో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 ఉన్నాయన్నారు. వీటి పునరుద్ధరణకు కేంద్రం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ నెల 11న పాత్రికేయుల డిమాండ్స్ డే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ నుంచి తహసీల్దార్, ప్రజాప్రతినిధులకు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ జిల్లా అధ్యక్షుడు ఇరోతు ఈశ్వరరావు, కింతాడ మదన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధుమేశ్వరపు రవికుమార్, సాంబశివ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాక్సింగ్ టోర్నమెంట్‌కు జ్యోతి



నర్సీపట్నం: గోవా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జూనియర్ బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు నర్సీపట్నం నింజాస్ అకాడమీ నుంచి బాక్సర్ గండి జ్యోతి 52 కేజీల విభాగంలో పాల్గొంటుందని సీనియర్ కోచ్ యర్రా రాజశేఖర్ తెలిపారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00